సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 9 । జూన్ । 2023



ఉప ఎన్నికలు ఏకగ్రీవం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవులకు గురువారం నిర్వహించిన ఉప ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 8లో ▸



విష ప్రయోగం

కుకునూరు మండలం అల్లిగూడెం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో సుమారు 150 కోళ్లు మృత్యువాత పడ్డాయి. 8లో ▸

108లో ప్రసవం

కాన్పు కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా ఓ గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. మగ శిశువుకు జన్మనివ్వగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.



8లో

న్యూస్‌రీల్

వేగంగా భూ సర్వే : జేసీ



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద రీసర్వే పనులపై గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, సర్వే ఆఫ్ ల్యాండ్ ఏడీ కె.జాషువా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా రెండో దశలో సర్వే ఆఫ్ ఇండియా నుంచి జిల్లాకు చెందిన 86 గ్రామాల మ్యాప్‌లు వచ్చాయని, పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పలుచోట్ల సర్వే వివిధ దశల్లో ఉందన్నారు. జిల్లాలోని 188 గ్రామాలకు సంబంధించిన మ్యాపులు సర్వే ఆఫ్ ఇండియా నుంచి రావాల్సి ఉందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

10న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం సమీపంలోని గోదాముల పక్కన గల వాండ్రం గ్రామ శివారులో రైల్వే గేటు పక్కన ఈనెల 10న ఉదయం 8 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు ఆచంట ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్లు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పోలవరం ప్రాజెక్ట్ పరిశీలన



పరిశీలిస్తున్న బీజేపీ ఎంపీ మనోజ్ కొటాక్

పోలవరం రూరల్/ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను బీజేపీ ఎంపీ మనోజ్ కొటాక్ గురువారం బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ దిగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మోదీ పాలనలో పోలవరం నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చి నిధులు విడుదల చేస్తున్నారని, పనులు వేగవంతం చేయాలని కోరారు. మోదీ 9 ఏళ్ల పాలన ప్రచార కార్యక్రమాలను గోదావరి జోనల్ ఇన్‌చార్జి, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయచౌదరి ఆధ్వర్యంలో చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, జిల్లా అధ్యక్షుడు కూర్చెళ్ల సుధాకర్ కృష్ణ, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి రేలంగి శ్రీదేవి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిషోర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పీఠం.. పద్మశోభితం

పద్మశ్రీ అను నేను..

- జెడ్పీ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ప్రమాణ స్వీకారం
- అట్టహాసంగా కార్యక్రమం
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో తొలిసారి బీసీ మహిళకు పట్టం



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ అభినందన సభలో మాట్లాడుతున్న పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, చిత్రంలో మంత్రి కారుమూరి, ఎంపీ కోటగిరి, చీఫ్ విప్ ముదునూరి, ఎమ్మెల్యేలు పుప్పాల, కొఠారు, ఎమ్మెల్సీలు కవురు, వంకా, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



చైర్‌పర్సన్ పద్మశ్రీని అభినందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



పద్మశ్రీని అభినందిస్తున్న పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఎన్నికయ్యారు. గురువారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమానికి ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఏలూరులోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొత్తం 35 మంది మెజార్టీ జెడ్పీటీసీలు పాల్గొన్నారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ పేరును ద్వారకాతిరుమల జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ ప్రతిపాదించగా, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం బలపరిచారు. మిగిలిన జెడ్పీటీసీల ఆమోదంతో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఎంపికైనట్టు ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

అంగరంగ వైభవంగా..

రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో బీసీ మహిళ పద్మశ్రీకి చైర్‌పర్సన్ పదవి వరించింది. దీంతో అంగరంగ వైభవంగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. పద్మశ్రీ భర్త గంటా ప్రసాదరావు వైఎస్సార్ సీపీలో కీలక నేత కావడం, నాయకులకు సుపరిచితులు కావడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు తరలివచ్చి ఆమెను అభినందించారు. ఉదయం ఆమె భారీ ర్యాలీతో ఏలూరులో జిల్లాపరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు.

తొలిసారిగా బీసీ మహిళకు..

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా బీసీ మహిళకు అవకాశం ఇవ్వడం పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ చరిత్రలో ఇదే తొలిసారి అని అన్నారు. జెడ్పీటీసీ పద్మశ్రీకి ఈ పదవి వరించడం వైఎస్ కుటుంబంపై నమ్మకం, విశ్వసనీయతకు అద్దం పడుతోందన్నారు. తండ్రి వైఎస్సార్ మహిళాభివృద్ధి కోసం రెండు అడుగులు వేస్తే జగనన్న నాలుగు అడుగులు ముందుకు వేసి చరిత్ర సృష్టించారని అన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో మహిళలకు కీలకమైన హోం, ఆరోగ్యం వంటి శాఖలను అప్పగించారన్నారు.

బీసీలకు సముచిత స్థానం : పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు సముచిత స్థానం కల్పించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. చైర్‌పర్సన్ పద్మశ్రీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్, శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఏలూరు మేయర్ నూర్జహాన్, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, జెడ్పీటీసీలు, అధికారులు పద్మశ్రీని అభినందించారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేలా..

నూతన చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని అన్నారు. అనంతరం భారీస్థాయిలో అభినందన సభ నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ నూతన జెడ్పీ చైర్‌పర్సన్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. జిల్లాపై తమదైన ముద్ర వేయాలన్నారు.

ఉపాధి అవకాశాల పెన్నిధి ఎంఎస్ఎంఈ



కౌన్సిల్ వైస్ చైర్మన్ అమర్‌నాథ్‌కు గుర్తింపు కార్డు ఇస్తున్న జాతీయ చైర్మన్ విజయ్‌కుమార్

ఆకివీడు: గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలు, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్ఎంఈ పెన్నిధిలా ఉందని ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. ఆకివీడు వీ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఎంఎస్ఎంఈ జాతీయస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రుణ సదుపాయం కల్పించి యూనిట్ల ఏర్పాటు, ఉత్పత్తి, మార్కెట్‌కు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. అలాగే రాయితీలు పొందవచ్చన్నారు. జాతీయ వైస్ చైర్మన్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మహిళా శక్తిని సద్వినియోగం చేసుకునేందుకు ఎంఎస్ఎంఈ దోహదపడుతుందన్నారు. రాష్ట్ర చైర్మన్ గిద్దలూరి సంపత్‌కుమార్ మాట్లాడుతూ పలు ప్రాజెక్టుల నివేదికలు తమ వద్ద ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించుకుని రాష్ట్రంలో యువశక్తి ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి పరిశ్రమల స్థాపనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్లలో పలు చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమల స్థాపన జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా తాము అప్పడాల తయారీ లఘు పరిశ్రమను నడుపుతూ ఆర్థికంగా నిలదొక్కుకున్నామని వీరవాసరం గ్రామ మహిళ దగ్గు సోని సభకు తెలియజేశారు. అనంతరం ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులైన పువ్వాడ రాజా అమర్‌నాథ్‌ను సత్కరించి ఆయనకు గుర్తింపు కార్డు, నియామక పత్రం అందజేశారు. జాతీయ వైస్‌చైర్మన్లు సీహెచ్ దుర్గా నాగప్రసాదరెడ్డి, అనిల్‌కుమార్ శ్రీవాస్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల ప్రతినిధులు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులను వధిస్తే చర్యలు

భీమవరం అర్బన్: బక్రీద్‌ను పురస్కరించుకుని ఈనెల 29న జిల్లాలో గేదెలు, ఆవులు, ఒంటెలు తదితర జంతువులను వధించడం, బలివ్వడం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పశుసంవర్థక శాఖ అధికారి, జిల్లా జంతు సంక్షేమ సంఘం కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ హెచ్చరించారు. భీమవరంలోని పశుసంవర్థక శాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జంతు సంక్షేమ సంఘ సభ్యులు, పోలీస్, మార్కెటింగ్, పంచాయతీ, రవాణా, పశుసంవర్థక శాఖ అధికారుల సమన్వయంతో ఇటువంటి చర్యలను అడ్డుకోవాలని కోరారు.

పేదల స్థలాల పూడికను అడ్డుకోవడం దుర్మార్గం

- ఎమ్మెల్యే నిమ్మలది రోజుకో వేషం
- ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: యలమంచిలి మండలం చించినాడలో మట్టి తవ్వకాలపై పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డ్రామాలాడుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ రోజుకో వేషం వేసే డ్రామానాయుడు గురించి ప్రభుత్వం పనిచేయదన్నారు. గోదావరి వరదల సమయంలో మేట వేసిన మట్టిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన కాలనీల్లో పూడిక కోసం తీస్తుంటే అనవసర రాద్ధాంతం చేయడం తగదన్నారు. గనుల శాఖ, జిల్లా కలెక్టర్ అనుమతితోనే మట్టి తీస్తుంటే నిమ్మల చేస్తున్న హడావుడి హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది గతంలో టీడీపీ హయాంలో జరిగిన మట్టి మాఫియా వ్యవహారం కాదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఆ స్థలాల పూడిక కోసం ప్రభుత్వానికి సంబంధించిన భూముల్లో మట్టిని అన్ని అనుమతులతో తీసుకువెళుతున్న విషయాన్ని ప్రతిపక్షాలు మరిచిపోకూడదని చెప్పారు. అక్కడేదో దళితుల భూములు లాక్కుంటున్నట్టు ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయం చేస్తున్నారని చీఫ్ విప్ ముదునూరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగనన్న కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తాం

జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ముదునూరి అన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఏ పేదవాడికైనా, ఏ దళితుడికైనా ఇంటి స్థలం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు, దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు స్థలాలను పూడుస్తుంటే గొడవ చేయడం తగదన్నారు. పేదలకు అండగా ఉంటాయన్న సీపీఎం, సీపీఐ పార్టీలు కూడా డ్రామానాయుడు ఉచ్చులో పడటం గమనించుకోవాలన్నారు. పల్లంగా ఉన్న జగనన్న కాలనీల్లో పూడిక పనులు ప్రభుత్వమే చేయాలని, అధిక వర్షాల వల్ల కొన్నిచోట్ల జాప్యం జరిగిందన్నారు. ఇప్పుడు వాతావరణం అనుకూలంగా ఉండటంతో పూడిక చేపడుతుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదు, పేదలకు, దళితులకు మంచి జరగకూడదు అనే దురుద్దేశంతోనే ప్రతిపక్షాలు ఇలా వ్యవహరిస్తున్నాయని చీఫ్ విప్ ముదునూరి విమర్శించారు.

వైద్య ఉద్యోగుల ఆనందోత్సాహాలు

ఏలూరు (టూటౌన్): కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంపై ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2019 మేనిఫెస్టోలో చేర్చి ఉద్యోగుల సర్వీసులను సీఎం జగన్ రెగ్యులరైజ్ చేశారని కొనియాడారు. థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. క్షీరాభిషేకం, తొమ్మిది రకాల పూలతో అభిషేకం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖలో సుమారు 3,500 మందిని రెగ్యులర్ చేస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి జె.గోవిందరావు మాట్లాడుతూ 2002 డీఎస్సీ రాసిన ప్రతి ఉద్యోగిని రెగ్యులర్ చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.పార్వతీశం, జిల్లా ఉపాధ్యక్షుడు పి.ప్రభాకరరావు, తాలూకా అధ్యక్షుడు పి.రవీంద్ర తదితరులు మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగుల తరఫున బట్టు విజయవర్ధన్, దారం సభాపతి, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రమేష్ బాబు, మహిళా ఉద్యోగులు టి.బేబి, ప్రియరాణి,సన్నిధి రాణి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం.. ఉచితం

- విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత బస్సు పాస్‌లు
- దరఖాస్తులకు ఆర్టీసీ ఆహ్వానం
- గతేడాది 25,576 మందికి అందజేత
- జిల్లాలో రూ.18.04 కోట్లు భరించిన ప్రభుత్వం



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్సు పాస్‌లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల చదువులకు ఊతమిచ్చేలా ఏటా ఆర్టీసీ బస్సు పాస్‌లు జారీ చేస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడి ఉచిత, రాయితీ పాస్‌ల కోసం ఆన్‌లైన్ ద్వారా ఆర్టీసీ దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ మేరకు www.apsrtcpass.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థులకు..

ఆర్టీసీ ఏటా విద్యార్థులకు ఉచిత పాస్‌లు అందిస్తోంది. బాలురుకు 12 ఏళ్లు నిండే వరకు, బాలికలకు 18 ఏళ్లు నిండే వరకు ఉచిత పాస్‌లు అందిస్తున్నారు. ఈ పాస్‌ల ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకోసం విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి (బోనిఫైడ్ సర్టిఫికెట్) ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. పాస్ ఐడెంటిటీ కార్డు నిమిత్తం రూ.50 చెల్లించాలి.

దివ్యాంగులకు.. ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాస్‌లు అందిస్తోంది. సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధితో పాస్‌లు జారీ చేస్తారు. ఐడీ కార్డుకు రూ.100 చెల్లించాలి.

గతేడాది 25,576 పాస్‌ల జారీ

గతేడాది జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 25,576 ఉచిత, రాయితీ పాస్‌లు జారీ చేశారు. ఇందులో ఉచిత పాస్‌లు దివ్యాంగులకు 3,077, విద్యార్థులకు 5,867, రాయితీ పాస్‌లు 16,632 ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.18.04 కోట్లు ఖర్చు భరించింది. మరిన్ని వివరాలకు ఆయా డిపోల మేనేజర్లను సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సి నంబర్లు

భీమవరం డిపో
9959225485,7382924754
నరసాపురం డిపో
9959225456, 7382908122
తణుకు డిపో
9959225484, 9848284384
తాడేపల్లిగూడెం డిపో
9959225488, 7382905856

రాయితీ పాస్‌లు : చదువుకునే ప్రతిఒక్కరూ ఈ పాస్ పొందవచ్చు. చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాస్ జారీ చేస్తారు. కళాశాల నుంచి (బోనిఫైడ్) సర్టిఫికెట్ సమర్పించాలి. విద్యార్థి ఫొటో జత చేయాలి. విద్యార్థి నెలవారీ, మూడునెలలకోసారి, సంవత్సరం పాస్‌లు పొందవచ్చు. మంత్లీ పాస్ ఐడీ కార్డుకు రూ.50, క్వార్టర్లీ, ఇయర్లీ పాస్‌ల ఐడీ కార్డులకు రూ.100 చొప్పున చెల్లించాలి.

భద్రంగా గమ్యస్థానాలకు.. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని, ప్రైవేట్ వాహనాల్లో ఎక్కి విద్యార్థులు ప్రమాదాలకు గురికావద్దని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. ఉచిత, రాయితీ బస్సు పాస్‌లను వినియోగించుకోవాలని కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ అందిస్తున్న ఉచిత, రాయితీ బస్సు పాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దివ్యాంగులు ఉచిత పాస్‌లు పొంది సురక్షంగా ప్రయాణించాలి. కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణ ఖర్చు ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే మొత్తం భరిస్తూ పాస్‌లు అందిస్తోంది. జిల్లాలోని నాలుగు డిపోల ద్వారా పాస్‌లు జారీ చేస్తాం.

– ఎ.వీరయ్యచౌదరి, ప్రజా రవాణా అధికారి, భీమవరం

పేదల అభ్యున్నతే ధ్యేయం



ఆచంట మండలం శేషమ్మచెరువులో ఇళ్ల పట్టాలు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో పేదల అభ్యున్నతి ధ్యేయంగా, సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఆచంట మండలం శేషమ్మచెరువు గ్రామంలో గురువారం లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఇచ్చిన మాట, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క చంద్రబాబు మాత్రమే అన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలుచేస్తుంటే రాష్ట్రం శ్రీలంక అవుతుందని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు రూటు మార్చారన్నారు. సీఎం జగన్ పథకాలకు పేర్లు మార్చి మరింతగా అమలు చేస్తానంటూ హామీలు గుప్పిస్తున్నారని విమర్శించారు. గతంలో డ్వాక్రా మహిళలు, రైతులకు ఇచ్చిన హామీలను పట్టించుకోని ఘనుడు చంద్రబాబు అని అన్నారు. పేదలకు సెంటు భూమి సేకరించని వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. అప్పుడు స్థానిక నాయకులు పేదల ఇళ్ల స్థలాలను ఏటీఎంల్లా మార్చుకొని నిత్యం వసూళ్లు చేసుకుంటూ పేదలపై బతికారని ఆరోపించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి, సర్పంచ్ జక్కంశెట్టి శ్రీరాములు, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ పెచ్చెట్టి లలిత, పార్టీ గ్రామ అధ్యక్షుడు జక్కంశెట్టి శివకుమార్, ఉప సర్పంచ్ నీలపాటి రామకృష్ణ, దేవ సొసైటీ అధ్యక్షుడు గుడాల చినరామకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముల పట్టివేత



ఆటోనగర్‌లో పట్టుకున్న కోడెనాగు, రక్తపింజరతో చదలవాడ క్రాంతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆటోనగర్‌లో గురువారం రెండు పాములను స్నేక్ సేవియర్ సొసైటీ (ఎస్ఎస్ఎస్) అధ్యక్షులు చదలవాడ క్రాంతి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆటోనగర్ ప్రాంతంలో పంది పిల్లలపై పాములు దాడి చేస్తుండటాన్ని స్థానికులు గమనించి వెంటనే చదలవాడ క్రాంతికి సమాచారం ఇచ్చారు. క్రాంతి ఘటనా స్థలానికి చేరుకుని రెండు పాములను పట్టుకున్నారు. వీటిలో ఎనిమిది అడుగుల పొడవు ఉన్న ఒక కోడె నాగు, ఐదు అడుగుల పొడవు ఉన్న రక్త పింజర ఉన్నాయి. పట్టుకున్న పాములను సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచి పెట్టినట్లు క్రాంతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: పురుగుమందు తాగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. చినపుల్లేరుకు చెందిన సాగిరాజు సూర్యనారాయణరాజు (43) గత నెల 26వ తేదీన మద్యం మత్తులో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతనిని స్థానిక ఆర్ఎంపీ సహాయంతో వైద్యం అందించారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఇంటి వద్దే ఉంచారు. అయితే ఈ నెల ఐదో తేదీన అనారోగ్యంగా అనిపించడంతో కుటుంబసభ్యులు అతనిని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తండ్రి వెంకట్రాజు ఫిర్యాదు మేరకు ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏకగ్రీవంగా స్థానిక సంస్థల ఉప ఎన్నికలు

- నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్, పెంటపాడు వైస్ ఎంపీపీ–2
- మరో రెండు ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు
- లాంఛనంగా ఎన్నిక.. ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవాలు


ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును గజమాలతో సత్కరిస్తున్న వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు

నూజివీడు: గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో ఖాళీగా ఉన్న పదవులకు గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఉప ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్, పెంటపాడు వైస్ ఎంపీపీ–2, పోడూరు మండలం పండిత విల్లూరు, నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం ఉప సర్పంచ్‌ల పదవులకు గురువారం ఎన్నికలు నిర్వహించారు.

నూజివీడులో..

నూజివీడు మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా 22వ వార్డు కౌన్సిలర్ కొమ్ము వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ పదవికి గత నెలలో షేక్ అమీరున్నీసాబేగం రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో కొమ్ము ఎన్నిక ఏకగ్రీవమైనట్టు రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ప్రకటించారు. అనంతరం ఆయనకు ధ్రువీకరణ పత్రం అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎక్స్‌అఫీషియో సభ్యుని హోదాలో హాజరయ్యారు. ఎన్నిక అనంతరం కౌన్సిల్ సమావేశ హాల్‌లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును వైస్ చైర్మన్ కొమ్ము గజమాలతో సత్కరించారు. అలాగే కౌన్సిలర్లందరినీ సత్కరించారు. ముందుగా ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ప్రతాప్ వచ్చారు. దారి పొడవునా బాణసంచా పెద్ద ఎత్తున కాల్చారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, టీపీఓ చిన వెంకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


పెంటపాడు వైస్ ఎంపీపీ–2 ముప్పిడి సరోజిని


పండిత విల్లూరు ఉప సర్పంచ్ సదమల్ల వెంకటేష్


లక్ష్మణేశ్వరం ఉప సర్పంచ్ అల్లు చంద్రశేఖర్

పెంటపాడు వైస్ ఎంపీపీ–2గా సరోజిని

పెంటపాడు: పెంటపాడు వైస్ ఎంపీపీ–2 స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో కోరిమిల్లి, చింతపల్లి గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు ముప్పిడి సరోజిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీఓ సీహెచ్ బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించగా, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సరోజినితో వైస్ ఎంపీపీగా లాంఛనంగా ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన ముప్పిడి సరోజినిని, ముప్పిడి సుబ్బారావు దంపతులను ఎంపీటీసీ సభ్యులతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పండితవిల్లూరులో..

పోడూరు: పండితవిల్లూరు ఉప సర్పంచ్‌గా 10వ వార్డు సభ్యుడు సదమల్ల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేసిన 2వ వార్డు సభ్యురాలు పినిపే సుమజ ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి సీఎస్‌వీ రెడ్డి సమక్షంలో ఉపసర్పంచ్ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లక్ష్మణేశ్వరంలో..

నరసాపురం రూరల్: నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామ ఉప సర్పంచ్‌గా అల్లు చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఎన్నికకు 14 సభ్యులు హాజరై ఉపసర్పంచ్‌గా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేసిన దేవిరెడ్డి రామారావు ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైనది. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన చంద్రశేఖర్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మేడిది నవీన్‌కిరణ్ ఉపసర్పంచ్ నియామకపు పత్రాన్ని అందజేశారు.

జగన్ వల్లే అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు

తణుకు టౌన్ : బీఆర్ అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్‌ల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజకీయ గుర్తింపు లేని కులాలకు రాజకీయ గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శవంతమైన నాయకుడిగా నిలుస్తారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాసనమండలి సభ్యుడు బొమ్మి ఇజ్రాయేలు అన్నారు. గురువారం తణుకు మండలం దువ్వ గ్రామంలో జరిగిన ఒక శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సామాజిక న్యాయాన్ని తు.చ.తప్పకుండా పాటిస్తున్నారన్నారు. మాదిగలకు ఒక ఎంపీ, కీలకమైన రెండు మంత్రి పదవులతో పాటు ఎనిమిది కార్పోరేషన్ చైర్మన్ పదవులు కట్టబెట్టారన్నారు. తూర్పుగోదావరి జిల్లాల్లో ఇప్పటివరకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా చేయలేని మాదిగలకు చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన చంద్రబాబు నాయుడు డప్పు కొట్టి, చెప్పులు కుట్టి మాదిగలను పెద్ద మాదిగను అవుతానని మభ్యపెట్టి, అధికారంలోకి రాగానే మాదిగలను నట్టేట ముంచాడన్నారు. ఇప్పుడు మరలా చంద్రబాబు తిరిగి అధికారంలోకి వస్తే అది చేస్తా, ఇది చేస్తానని మరోసారి మాదిగలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజకీయ శూన్యత గురవుతున్న కులాలకు రాజకీయ భిక్ష పెట్టిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు మాదిగలు కృషి చేయాలని కోరారు. నాయకులు సిరాజ్, రాజేంద్ర, తుట్ట రాజు, కొడవట్ల కిట్టు, సన్ని, చింటూ పాల్గొన్నారు.

జగనన్న ఇల్లు ప్రారంభించిన మంత్రులు


నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కారుమూరి, తానేటి వనిత

తణుకు టౌన్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని జగనన్న కాలనీలో గ్రామానికి చెందిన కోలపల్లి సూర్యారావు నిర్మించుకున్న నూతన గృహాన్ని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమాని అందించిన ప్రసాదాలను స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నరసాపురం మండలంలోని పెదమైనవానిలంక గ్రామానికి చెందిన మైలా మాణ్రాజు (55) తన ద్విచక్రవాహనంపై కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం పల్లిపాలెంలో ఓ శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి తన స్వగ్రామానికి వెళుతుండగా మండలంలోని లోసరి గ్రామ పంచాయతీ పరిధిలోని బరువానిపేట వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు మాణ్రాజును ఢీకొట్టి వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మైలా మాణ్రాజుకు ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారు. అల్లుడు జల్లా రంగయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో కొత్త జెడ్పీ చైర్‌పర్సన్


జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ, ప్రసాద్ దంపతులకు స్వామివారి మెమెంటోను అందజేస్తున్న ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని నూతన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం రాత్రి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు పద్మశ్రీ, ప్రసాద్ దంపతులకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా ఆలయ ఏఈఓ పి.నటరాజారావు శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా స్వామివారిని దర్శించినట్టు చెప్పారు. స్వామివారి ఆశీస్సులతో ద్వారకా తిరుమల క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, జీవీకే రెడ్డి తదితరులున్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అత్తిలి: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై కేసీహెచ్ స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంచిలి నుంచి పాలి గ్రామానికి పంటచేలకు వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్నట్లు స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎస్సై స్వామి పరిశీలించారు. ఘటన జరిగి నాలుగైదు రోజులు కావచ్చని, గుర్తు తెలియని వ్యక్తి వయస్సు సుమారు 47 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండవచ్చన్నారు. నలుపు ఛాయ కలిగిన ఇతను నీలం రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని, బట్ట తల కలిగి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు అత్తిలి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు అందించాలని ఎస్సై కోరారు.

విష ప్రయోగంతో నాటు కోళ్లు మృతి


మృతి చెందిన కోళ్లు

కుకునూరు: నాటు కోళ్లపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో సుమారు 150 కోళ్లు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అల్లిగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోలగాని వెంకట్రావు వ్యక్తిగత పనులపై కుటుంబ సభ్యులతో కలిసి గురువారం వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేసరికి 150 కోళ్లు మృతి చెంది ఉన్నాయి. తనంటే గిట్టని వారే కోళ్లపై విషప్రయోగం చేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు పాలకొల్లులో మెగా జాబ్ మేళా

సాక్షి, భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లులోని దాసరి నారాయణరావు (డీఎన్నార్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరోమోటార్స్, ముత్తూట్ ఫైనాన్స్, కియా మోటార్స్, అపోలో ఫార్మసీ, ఎల్ఐసీ వంటి వివిధ కంపెనీల్లో 600లకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. జాబ్‌మేళాకు 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇతర వివరాల కోసం 89856 44389 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కృష్ణారెడ్డి కోరారు.

13న ఏలూరులో మినీ జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ.తమ్మాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో టెక్ మహీంద్ర, అపోలో ఫార్మసీ, క్యాలిబర్, లాట్ మొబైల్స్, సీఎంఆర్ జ్యూయలర్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జాబ్ మేళా ద్వారా సుమారు 200 మంది యువతకు ఉద్యోగావకాలు కల్పిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు 94934 82414, 89196 08183 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కాంట్రాక్టర్ ఇంటిపై డీఆర్ఐ అధికారుల దాడి

మొగల్తూరు: కేపీ పాలెంలోని ఓ కాంట్రాక్టర్ ఇంటిపై రాష్ట్రానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు గురువారం దాడులు చేశారు. జీఎస్టీ చెల్లింపుల్లో అనుమానాలు రావడంతో జీఎస్టీ అధికారులు సదరు కాంట్రాక్టర్ చేసిన పనులకు సంబంధించిన పత్రాలు, రసీదులను వెంట తీసుకువెళ్లారు. సోమవారం విజయవాడలోని తమ కార్యాలయానికి రావాలని నోటీసులు ఇచ్చారు. ఇదే తరహాలో మరో రెండు బృందాలు నరసాపురంలో దాడులు నిర్వహించినట్టు తెలిసింది.

108లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం


108 వాహనంలో పెనుమాకలంక మహిళకు డెలివరీ చేయించిన ఈఎంటీ వరలక్ష్మి

మండవల్లి: కాన్పు కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే ఓ గర్భిణి 108 వాహనంలోనే ప్రసవించింది. వివరాలిలా ఉన్నాయి. పెనుమాకలంక గ్రామానికి చెందిన సీహెచ్ వాణి అనే గర్భిణికి గురువారం నొప్పులు ఎక్కువడంతో 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. 108 డెలివరీ ఈఎంటీ జి వరలక్ష్మి వాహనంలో పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షించింది. మార్గమధ్యంలో మధ్యాహ్నం 2.52 గంటలకు వాణి మగబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వీరిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ జి వరలక్ష్మి, వాహన డ్రైవర్ రాంబాబులను 108 వాహనాల జిల్లా మేనేజర్ డి వెంకటేష్, ఓఈ సాయిరామ్ అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో మహిళకు ఏడాది జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ నగరంలోని నాలుగో ప్రత్యేక మెజిస్ట్రేట్ గురువారం తీర్పు చెప్పారు. ఫిర్యాది న్యాయవాది ఎడ్ల రాజారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితురాలు పశ్చిమగోదావరి జిల్లా ఏఎస్‌పీఎస్ శ్యాం కృషియాన్ భార్య ఉషారాణి. ఆమె తన అవసరాల నిమిత్తం 2013లో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య శ్యాంబాబు నుంచి రూ.8 లక్షలు అప్పుగా తీసుకుని ఒక ప్రాంసరీ నోటు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శ్యాంబాబు తన బాకీ తీర్చాలని కోరగా ఉషారాణి 2017 ఆగస్టు ఏడో తేదీన ఒక చెక్కు ఇచ్చారు. పాక్షికంగా బాకీ తీర్చే నిమిత్తం రూ.8 లక్షలకు జారీ చేసిన చెక్కును ఫిర్యాది శ్యాంబాబు తన ఖాతాలో జమ చేశారు. తగిన నిధులు లేని కారణంగా ఆ చెక్కు నిరాదరణకు గురైంది. దీనిపై ఫిర్యాది లీగల్ నోటీస్ జారీ చేసినా ప్రయోజనం లేక శ్యాంబాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసు విచారణలో ఉండగా శ్యాంబాబు మృతి చెందారు. కేసు విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


పేదలకు అన్నదానం చేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని కోతి బొమ్మ సెంటర్‌లో గురువారం షిర్డీ సాయి మందిరం వద్ద డైమండ్స్ సభ్యులు సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మోటూరి వెంకటరత్నం, చాముండేశ్వరి, పడాల కావ్యారెడ్డి, మాధురి, తాళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తణుకు ఎల్ఐసీ బీఎంగా శ్రీనివాస్ రాజశేఖర్


తణుకులో ఎల్ఐసీ బీఎం శ్రీనివాస్ రాజశేఖర్‌ను అభినందిస్తున్న ఏజెంట్లు

తణుకు అర్బన్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ తణుకు శాఖ సీనియర్ బ్రాంచ్ మేనేజరుగా కాజా శ్రీనివాస్ రాజశేఖర్, ఏబీఎంగా కె.మాలతీ సుదీప్తలు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఎల్ఐసీ ఏజెంట్లు వారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సంస్థ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని ఏజెంట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవోఐ జోనల్ జనరల్ సెక్రటరీ పీఎల్ నరసింహారావు, ఏవోఐ గౌరవ అధ్యక్షుడు సత్తి పాండురంగారెడ్డి, ఏవోఐ అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కరరావు, కార్యదర్శి రవిరామకృష్ణ, బొలిశెట్టి రామనాథ్, చెక్కా గోపాలకృష్ణ, లియాఫీ అధ్యక్షుడు వైవీ శ్రీనివాస్, కార్యదర్శి మూర్తి, ఏజెంట్లు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ


సోమరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామానికి చెందిన జంపన సోమరాజు మృతి పట్ల రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం దువ్వలోని సోమరాజు నివాసంలో ఆయన తండ్రి జంపన వెంకట్రామరాజు, ఇతర కుటుంబ సభ్యులను కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీపీ రుద్ర ధనరాజు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పూర్తి వేతనం ఇవ్వాలి

పెంటపాడు: కూలీలకు పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి అన్నారు. గురువారం జట్లపాలెం గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న పని ప్రదేశంలోని కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని కావాలన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఉపాధిలో తొలగించిన సౌకర్యాలను పునరుద్ధరించడంతో పాటు జిల్లాకు భారీగా కేంద్రం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, అబ్బులు, రామలక్ష్మి, సరస్వతి, అప్పల నరసమ్మ, రాము, సన్యాసిరావు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రాలు

- తణుకులో ప్రతి రోడ్డులోను ఉన్న చలివేంద్రాలు
- పశువులకు నీళ్ల తొట్టెలు ఏర్పాటు చేసిన సత్యసాయిసేవాసమితి

తణుకు అర్బన్: మండుతున్న ఎండలకు ప్రయాణికుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. 40 డిగ్రీలు దాటి కాస్తున్న ఎండలకు తోడు వేడిగాల్పుల తీవ్రతకు ప్రయాణికులు సొమ్మసిల్లి పడిపోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తణుకు నియోజకవర్గంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నాయి. తణుకు నియోజకవర్గంలో తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో సుమారుగా 40కి పైగా చలివేంద్రాల ద్వారా మజ్జిగ, తాగునీరు అందజేస్తున్నారు.

సత్యసాయి సేవాసమితిచే మూగజీవాల చలివేంద్రాలు

సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు పట్టణ పరిధిలో 30 వరకు నీళ్ల తొట్టెలు ఏర్పాటు చేశారు. ఆయా నీళ్ల తొట్టెల వద్ద నీటిని నిల్వ చేసే నిమిత్తం ప్రత్యేకంగా పైపు లైన్లు ఏర్పాటు చేశారు. ఆవులు, ఎద్దులు, గిత్తలతో పాటు కుక్కలు సైతం ఈ నీళ్ల తొట్టెల్లో ఉన్న నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

కారుమూరి సేవాసమితి ఆధ్వర్యంలో...

రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నిర్వహిస్తున్న కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో తణుకు నియోజకవర్గంలో 10 మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మునిసిపాలిటీ పరిధిలో 4 చలివేంద్రాలు, గ్రామాల్లో 6 చలివేంద్రాల ద్వారా మజ్జిగ అందిస్తున్నాయి. చలివేంద్రంలో ఏర్పాటు చేయబడ్డ సిబ్బంది ద్వారా ఉదయాన్నే మజ్జిగ టిన్‌లు, తాగునీటిని నిల్వ చేసుకుని కరివేపాకు జీలకర్ర తదితర సామాగ్రితో కలిపి తయారు చేసిన మజ్జిగను సాయంత్రం వరకు నిర్విరామంగా అందిస్తున్నారు.


తణుకులో కారుమూరి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం


తణుకు సజ్జాపురంలో మూగజీవుల కోసం ఏర్పాటు చేసిన నీళ్ల తొట్టె

దాహార్తిని తీరుస్తున్న మజ్జిగ చలివేంద్రాలు



తణుకు నియోజకవర్గంలో కారుమూరి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ ఎండా కాలం ప్రారంభం నుంచి నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాలు ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, స్ఫూర్తితో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు 10 మజ్జిగ చలివేంద్రాల ద్వారా ప్రయాణికుల దాహం తీరుస్తున్నారు.

– జంగం ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు

మూగ జీవాలకు నీళ్లు



సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు తణుకులో 30 నీళ్ల తొట్టెలు ఏర్పాటు చేశారు. తణుకు రామకృష్ణ మఠం వీధిలో మా ఇంటి ముందు సమితి ఆధ్వర్యంలో నీటి తొట్టె ఏర్పాటు చేయగా ఎప్పటికప్పుడు నీటిని నింపేందుకు ప్రత్యేకంగా వాటర్ లైను ఏర్పాటు చేశాను. ఎండదెబ్బకు ప్రతిరోజూ ఆవులు, గిత్తలు వచ్చి నీటిని తాగుతున్నాయి.

– కర్రి రామచంద్రారెడ్డి, సత్యసాయి సేవాసమితి సభ్యుడు, తణుకు

నేడు విద్యుత్ అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గూడెం సౌత్ టూ టౌన్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు సంబంధించి 11 కేవీ పడాల ఫీడర్ పరిధిలో అత్యవసర పనుల కోసం శుక్రవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ప్రకటించారు. పడాల, ముత్యాలంభపురంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రెండు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇరగవరంలో..

ఇరగవరం: మండలంలోని 33 కెవి ఇరగవరం ఫీడర్‌లో శుక్రవారం అత్యవసర పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తణుకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. మండలం మొత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటలకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమృత సరోవర్ ట్యాంకుల పరిశీలన

పెంటపాడు: మండలంలోని అమృత సరోవర్ ట్యాంకులను గురువారం ఆకుతీగపాడు గ్రామంలో పంచాయతీ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవానీ మాట్లాడుతూ అమృత సరోవర్ పథకంలో భాగంగా గ్రామాల్లో తాగునీటి చెరువులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ వీరాస్వామి, ఈసీ రాజేష్, శ్రీనివాస్, డ్వామా టీఏ థామస్, గ్రామ కార్యదర్శి నాగదేవి, ఉపాధి సిబ్బంది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఠారెత్తించిన ఎండ


తాడేపల్లిగూడెం పట్టణంలో కె.ఎన్.రోడ్డు రహదారిలో జన సంచారం లేని దృశ్యం

- తెల్లవారుజామున మంచు దుప్పటి
- ఆపై తారాస్థాయిలో ఉష్ణోగ్రతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత కొన్ని రోజులుగా ఎండలు మండిపోతుండడంతో పాటు వడగాల్పులు వీస్తున్నాయి. పట్టణంలో సరాసరి 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు కక్కుతుండడంతో జనం రోడ్లపైకి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడి గాలుల కారణంగా వడదెబ్బ, డీహైడ్రేషన్(శరరంలోని లవణాలు కోల్పోవడం) కలిగే అవకాశముందని సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమవుతుందని ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య శాఖ విస్తృత ప్రచారం చేస్తుంది. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలు మధ్యాహ్నం వేళ బయటకు రాకుండా చూసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు, ముఖానికి మాస్కులను ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. కళ్లకు అద్దాలు ధరించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగులకు గాయాలు

నరసాపురం: పట్టణంలోని నరసాపురం–మొగల్తూరు మార్గం 216 జాతీయ రహదారిపై సత్తిబాబు జ్యూస్ సెంటర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు గాయపడ్డారు. లక్ష్మణేశ్వరం గ్రామ సచివాయంలో పని చేస్తున్న కోపెర్ల విజయదుర్గ , పాత్తూరి వెన్నెల ఇద్దరు స్కూటీపై పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయానికి పని ముగించుకుని వెళ్తుండగా, నరసాపురం వైపు బైక్‌పై వేగంగా వచ్చిన యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెన్నెల పరిస్థితి విషమంగా ఉండటంతో భీమవరం తరలించారు. విజయదుర్గ స్థానికంగా ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు టౌన్ ఎస్సై ప్రసాద్ చెప్పారు.

ప్రత్యేక విభాగాల ద్వారా యూనియన్ బ్యాంక్ సేవలు


మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సంగీత కుమారి, తదితరులు

తణుకు టౌన్: వివిధ రంగాల వారీగా యూనియన్ బ్యాంక్ రుణాలు అందించేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ పీ సంగీత కుమారి చెప్పారు. తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన యూనియన్ బ్యాంక్ అవుట్ రీచ్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి లీడ్ బ్యాంక్ మేనేజర్ జీఎం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రీజినల్ హెడ్ సంగీత కుమారి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం మార్చి నాటికి నికర లాభం 61శాతం అభివృద్ధి సాధించిందని తెలిపారు. ప్రసుత్తం జిల్లాలో 73బ్రాంచ్‌ల్లో 58 ఏటీఎం సెంటర్లతో 90కి పైగా బీసీ పాయింట్లతో 20 లక్షల మంది ఖాతాదారులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయ రుణాలను త్వరితగతిన అందించేందుకు ప్రత్యేక అగ్రి కల్చరల్ లోన్ పాయింట్‌ను, ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రీజినల్ డిప్యూటీ హెడ్ ఆర్ దివాకర్, ఎంసీ హెడ్ జీఎం శ్రీనివాసరావు, చీఫ్‌మేనేజర్ ఆపరేషన్స్ ఎస్‌వీవీ రమణ, తణుకు బ్రాంచ్ హెడ్ ఎస్‌వీకే సీహెచ్ఎస్ సురేష్, వివిధ జిల్లాలోని బ్రాంచ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్న ఘనత జగన్‌దే


సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతదేశ చరిత్రలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే, ఏకైక వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత జగన్‌కే సాధ్యమన్నారు. ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం అనేక సంక్షేమాలతో పాటు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు ఉన్న పేదలకు జానెడు భూమి ఇవ్వలేదని చెప్పారు. గతంలో కేంద్రం కాళ్లు పట్టుకొని చంద్రబాబు ఢిల్లీ యాత్రలు మాత్రమే చేస్తున్నారని, ప్రజలకు జరిగిన ప్రయోజనం లేదన్నారు. నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ యాత్ర చేసి కేంద్రాన్ని కలిస్తే, కేంద్ర ప్రభుత్వం సైతం స్పందించి ఆంధ్రప్రదేశ్‌కు నిధులు మంజూరు చేస్తుందని, ఇది చూసిన చంద్రబాబుకు వెన్నులో వణుకుపుడుతుందని చెప్పారు. ఇటీవల కేబినెట్ మీటింగ్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయడం, అనేక సంక్షేమాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, గ్రూపు 1, 2 ఉద్యోగాలు భర్తీ చేయడానికి నిర్ణయించడం పట్ల మంగరాజు స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చెల్లెం పర్యటన

యలమంచిలి: చించినాడ పెరుగు లంక భూముల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు పర్యటిస్తానని ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమి విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న లిఖిత పూర్వకంగా తనకు తెలియజేయాలని కోరారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు


అత్తిలిశాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


గూడెంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు లెక్కలు సులభంగా ఎలా నేర్చుకునే విధానం, గణిత చమత్కారమంజరిపై ఉపాధ్యాయుడు విజయకుమార్ అవగాహన కల్పించారు. రిటైర్డు ఉపాధ్యాయుడు కె వెంకట్రావు ఇంగ్లీషు, గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, బి నాగేశ్వరరావు, పి వెంకటేశ్వరరావు, ఎం శ్రీదేవి, పావని పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం పి మాధవి, గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్ –1 గ్రంథాలయంలో 32వ రోజు గురువారం వేసవి శిక్షణ శిబిరం ఆహ్లాదకరంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. సాల్మన్‌రాజుచే కుక్క, పాము కరిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాక్సినేషన్‌పై అవగాహన చేశారు. ఎ.జనార్ధనరావు పిల్లలకు హిందీ పాఠ్యాంశాలు, సామెతలు, సూక్తులు నేర్పించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు మహాభట్టు లక్ష్మణరాజుచే నీతిపద్యాలతో పాటు దేశభక్తి గేయాలను నేర్పించారు. విశ్రాంత ఎల్ఐసీ ఉద్యోగి జి.బాపయ్యశర్మచే ప్రముఖుల జీవిత చరిత్ర విశేషాలను వెల్లడించారు.

దాతల సహకారం అభినందనీయం

సాక్షి, భీమవరం: ప్రభుత్వ శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని భీమవరం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఫీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. స్థానిక వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలలకు సత్కారం, బాలలకు స్ఫూర్తి అనే కార్యక్రమంలో భాగంగా రైఫిల్ షూటింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన ముగ్గురు బాలలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, డీవీ నాగేశ్వరరావు, కె.పద్మ, ఎం.శ్యామల, డి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

సాక్షి, భీమవరం: స్థానిక శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ బీవీ రాజు 21వ వర్ధంతి సందర్భంగా గురువారం భీమవరం పట్టణం, పరిసర గ్రామాల్లో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలోని బీవీ రాజు విగ్రహానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శృంగవృక్షంలోని లెప్రసీ సెంటర్, ఎఫ్ఎంఎల్ఆర్ సెంటర్స్‌ల్లోని లెప్రసీ రోగులకు బియ్యం, పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే భీమవరం సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్‌లో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ రోగులకు రూ. 50 వేలు విలువ చేసే మందులు, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. 7వ వార్డు లెప్రసీ కాలనీలో 112 మంది రోగులకు బియ్యం, పింఛన్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే కుముదవల్లి, బీవీరాజు మార్గ్, బీవీ రాజు మునిసిపల్ పార్క్ తదితర ప్రాంతాల్లో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

తణుకులో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ప్రారంభం


ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ప్రారంభంలో పాల్గొన్న సీడీపీవో, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది

తణుకు టౌన్: తణుకు కేంద్రంగా నూతనంగా ఏర్పడిన ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కార్యాలయాన్ని గురువారం తణుకులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ కేటీ సుధాకర్‌లకు ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాల పునర్ విభజనలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని పెరవలి ప్రాజెక్ట్ పరిధిలో తణుకు నియోజవకర్గంలోని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఉండేవి. అయితే నూతన జిల్లాల ఏర్పాటుతో పాటు నూతన ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ సిబ్బంది మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో సంప్రదించి తణుకు నూతన కేంద్రంగా నూతన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏర్పడిందని పేర్కొన్నారు. దీంతో తణుకులో ఆధార్ నమోదు కేంద్రం భవనంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. సీడీపీవో ప్రమోద కుమారి, సూపర్‌వైజర్లు సీహెచ్ వెంకటలక్ష్మీ, కృష్ణ కుమారిలతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గర్భిణులకు వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ముదునూరు పీహెచ్‌ల వద్ద శుక్రవారం మాతృత్వ వందన యోజన పథకంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు ఆయా ఆసుపత్రుల నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.